తెలంగాణ ప్రజావారధి

ప్రతి అడుగు నిజం వైపు

www.telanganaprajavaradhi.com

తెలుగు దినపత్రిక



హైదరాబాద్ శుక్రవారం 20 - 11 - 2026 ఎడిటర్ : యాదగిరి అవిశెట్టి పేజిలు : 3

అడ్డగూడూరు గురుకుల స్కూల్‌ను ప్రక్షాళన చేయాలి

మోత్కూరు మార్కెట్ మాజీ చైర్మన్ చిప్పలపల్లి మహేందర్‌నాథ్



ప్రజావారధి/అడ్డగూడూరు

అడ్డగూడూరు బాలికల గురుకుల స్కూల్‌లో జరిగిన ఘటనపై పోలీసులు, అధికారులు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, స్కూల్‌లో అక్రమంగా జరుగుతున్న కార్యకలాపాలన్నింటి పై పూర్తి ప్రక్షాళన చేపట్టాలని మోత్కూరు మార్కెట్ మాజీ చైర్మన్ చిప్పలపల్లి మహేందర్‌నాథ్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వంట మనిషి వెంకన్న విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినట్టు తెలిసి కూడా ప్రిన్సిపాల్ నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణమన్నారు. వంట మనిషితో పాటు బాధ్యులైన ప్రిన్సిపాల్, అటెండర్ పూలమ్మ, ఆమె భర్త సోమయ్య ఇతరులపై క్రిమినల్ కేసులు పెట్టాలన్నారు. స్కూల్ లో ఏం జరుగుతుందో పర్యవేక్షించకుండా విధుల పట్ల అలసత్వం వహించిన జోనల్ ఆఫీసర్ కూడా అధికారులు శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గురుకులాల్లో ఏ కాంట్రాక్ట్ పని కూడా అందులో పనిచేస్తున్న ఉద్యోగికి గాని, వారి భర్తలు, కుటుంబ సభ్యులు చేసే అవకాశం లేదని, కానీ స్కూల్‌లో పనిచేస్తున్న అటెండర్ పూలమ్మ భర్త సోమయ్య పేరు మీద డైట్ కాంట్రాక్టర్ పేరుతో సుమారు 12 ఏళ్లుగా టెండర్లు వేస్తూ విద్యార్థుల సొమ్ము దోచుకతింటున్నాడని ఆరోపించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదని, సక్రమంగా భోజనం పెట్టడం లేదని విద్యార్థులు అడిగితే సోమయ్య, పూలమ్మ బెదిరించడంతో పాటు తిడతారని, ప్రిన్సిపాల్‌కు మామూళ్లు ఇచ్చి దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. సంబంధిత అధికారులు స్కూల్‌లో పూర్తిస్థాయిలో లోతైన విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని, వారికి పూర్తిస్థాయి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.

శాలిగౌరారంలో ఉచిత బీపీ, షుగర్ పరీక్షల శిబిరం



ప్రజావారధి/శాలిగౌరారం

లయన్స్ క్లబ్ ఆఫ్ శాలిగౌరారం ఆధ్వర్యంలో గురువారం శాలిగౌరారంలోని స్టేట్ బ్యాంక్ ఎదురుగా ఉచిత బీపీ, షుగర్ పరీక్షల శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో ఆర్ఎంపీ వైద్యులు డాక్టర్ దామెర్ల శ్రీనివాస్, డాక్టర్ దునుక వెంకన్న 100 మందికి బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా ఉచిత వైద్య సేవలు అందించిన వైద్యులకు, కార్యక్రమానికి సహకరించిన సభ్యులకు క్లబ్ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా ఇటువంటి సేవా కార్యక్రమాలను భవిష్యత్తులోనూ కొనసాగిస్తామని లయన్స్ క్లబ్ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జోన్ చైర్మన్ డెంకల సత్యనారాయణ, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నిమ్మల ఆంజనేయులు, కోశాధికారి మురారి శెట్టి కరుణాకర్, వడ్లకొండ భిక్షం, గుండు పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

అడ్డగూడూరు స్కూల్ ఘటనలో..

పోలీసుల పనితీరు అభినందనీయం

జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మాజీ సభ్యుడు దాసరి తిరుమలేష్

ప్రజావారధి/మోత్కూరు

యాదాద్రిభువనగిరి జిల్లా అడ్డగూడూరు బాలికల గురుకుల స్కూల్‌లో విద్యార్థినులపై జరిగిన ఘటనలో పోలీస్ అధికారులు వెంటనే చర్యలు చేపట్టడం అభినందనీయమని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మాజీ సభ్యుడు దాసరి తిరుమలేష్ అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అడ్డగూడూరు స్కూల్‌లో జరిగిన ఘటన అత్యంత దారుణమైన ఘటన అని, విషయం బయటకు వచ్చిన వెంటనే కలెక్టర్, ఆర్డీవో, డీఎస్పీ, అడిషనల్ ఎస్పీ స్పందించి చర్యలు తీసుకున్న తీరు హర్షణీయమన్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నేషనల్ హైవే 930పీ రోడ్డు ప్రమాదకరంగా మారి నిత్యం ప్రమాదాలు జరిగి ఎన్నో కుటుంబాలు చిన్నాభిన్నమవు తున్నాయని తెలిపారు. అడ్డగూడూరు నుంచి చిర్రగూడూర్ నుంచి వలిగొండ వరకు హైవేపై ప్రమాదాల నివారణకు చౌటుప్పల్ డీఎస్పీ ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, డేంజర్ స్పాట్లను గుర్తించి ప్రమాదాలు జరగకుండా వాహనదారుల రక్షణ



930పీ హైవేపై ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి

కోసం హైవేపై హెచ్చరిక బోర్డులు, స్పీడ్ లిమిట్ బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు. హైవే చుట్టుప్రక్కల ఆయా ప్రాంతాల ప్రజలకు అవగాహన కల్పించాలని, బైకులపై వెళ్లేవారు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలన్నారు. అడ్డగూడూర్, మోత్కూర్, ఆత్మకూర్ (ఎం), వలిగొండ మండలాల పోలీసులతో పాటు అవసమైతే ఇతర అధికారులతో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు.

అడ్డగూడూరు స్కూల్ బాధ్యులపై

క్రిమినల్ కేసులు పెట్టాలి

బీఆర్ఎస్ జిల్లా నాయకులు బండెల శ్రీను

ప్రజావారధి/మోత్కూరు

అడ్డగూడూరు బాలికల గురుకుల స్కూల్ ఘటనలో నిందితులపై క్రిమినల్ కేసులు పెట్టాలని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు బండెల శ్రీను డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థినులపై లైంగిక వేధింపుల విషయంలో వంట మనిషి వెంకన్నతో పాటు నిర్లక్ష్యం వహించిన ప్రిన్సిపాల్‌పై సస్పెండ్ చేసి చేతులు



దులుపుకోకుండా క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, విధుల నుంచి పూర్తిగా తొలగించాలని డిమాండ్ చేశారు. జిల్లా అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే స్కూల్‌లో గత కొంతకాలంగా దారుణ ఘటనలు, అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపించారు. స్కూల్‌లో విద్యార్థినులకు భద్రత కల్పించడంతో పాటు నాణ్యమైన భోజనం అందించాల్సి ఉండగా ప్రిన్సిపాల్ నిర్లక్ష్యంతోనే వంట మనిషి దారుణానికి పాల్పడ్డాడని, కాంట్రాక్టర్‌తో కుమ్మక్కడంతోనే

విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పెట్టడం లేదన్నారు. స్కూల్‌లో అక్రమంగా నిర్వహిస్తున్న కాంట్రాక్టులపై పూర్తిస్థాయి విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇకముందు ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా స్కూల్‌లో అవగాహన సదస్సులు నిర్వహించి విద్యార్థినులకు కౌన్సెలింగ్ ఇవ్వాలని, విద్యార్థినుల రక్షణ, భరోసా కోసం ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం ఇద్దరు మహిళా కానిస్టేబుళ్లతో విజిట్ చేయించి పర్యవేక్షించాలని కోరారు.

తెలంగాణ ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక

శాలిగౌరారం మండల పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కమిటీ ఎన్నిక

ప్రజావారధి/శాలిగౌరారం
శాలిగౌరారం మండల పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శాలిగౌరారం చర్చిలో జరిగిన సమావేశంలో మండలంలోని గ్రామాల పాస్టర్లు పాల్గొని కమిటీని ఎన్నుకున్నట్టు తెలిపారు. మండల అధ్యక్షుడిగా ఈరదాస్ బాలరాజు (ఆకారం), ఉపాధ్యక్షుడిగా గుండ్లపల్లి ఆశీర్వాదం (వల్లాల), ప్రధాన కార్యదర్శిగా మొలుగూరి అంబేద్కర్





(అంబారిపేట),సహాయ కార్యదర్శిగా ఎ.ఏసుపాదం, కోశాధికారిగా ఎం.సునీల్ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా టి.నతానియేలు, వి.హెబ్సిబా, ఎం.కుమార స్వామి, గౌరవ సలహాదారులుగా వి.హనోకు, టి.సీమోను, జి.శ్యాంసన్ ఎన్నికయ్యారని తెలిపారు. సభ్యులుగా సిహెచ్. డేవిడ్, బి.ఇస్రాయెల్, కె.లాజర్, పి.ఎలీషా, మురళి జోసెఫ్, మోహన్ గౌడ్, సాల్మన్ రాజ్, శ్యాంబాబు, రమేష్ ఉంటారన్నారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను సన్మానించి శుభాకాంక్షలు చెప్పారు. మండలంలో ఐక్యతతో సేవా కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తామని నూతన కమిటీ ప్రకటించింది.

కరువు ప్రకటించినా సహాయం శూన్యం

పెర్కకొండారంలో రైతులు, కూలీల సమస్యలపై ఏఐకేఎంఎస్ సర్వే



ప్రజావారధి/శాలిగౌరారం
ఎల్‌నినో ప్రభావంతో శాలిగౌరారం మండలాన్ని కరువు మండలంగా ప్రకటించినా ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి సహాయక చర్యలు చేపట్టలేదని ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబటి చిరంజీవి ఆరోపించారు. శాలిగౌరారం మండలంలోని పెర్కకొండారం గ్రామంలో బుధవారం ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో రైతుల పంటల పరిస్థితి, వ్యవసాయ కూలీల సమస్యలపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో పత్తి, వరి, నిమ్మ, మిరప సాగు చేసిన రైతులు వర్షాభావం, నీటి కొరతతో తీవ్రంగా నష్టపోయారన్నారు. దిగుబడి తగ్గి, పంటలు ఎండిపోవడంతో రైతులు అప్పుల భారంతో ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోతున్నారని తెలిపారు. పనులు లేక కూలీలకు ఉపాధి కరువై కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను తెలుసుకునేందుకే ఈ సర్వే చేపట్టామని చెప్పారు. నష్టపోయిన రైతులకు వెంటనే పంట నష్టపరిహారం, కరువు సహాయం అందించాలని, కూలీలకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ఏఐకేఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షులు వేముల శంకర్ మాట్లాడుతూ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులను, కూలీలను ఆదుకోవాలన్నారు. పశువులకు గడ్డి, నీళ్లు ఏర్పాటు చేయాలని, గ్రామాల్లో మంచినీటి కొరత లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ నాయకులు పాములపాటి శంభయ్య, అరిగె వెంకన్న, జానయ్య, బోల్లేపల్లి వెంకన్న, ప్రమీల, సుశీల, మల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.